# ఈ పుణ్యభూమిలో స్త్రీ

శ్రీరామ నవమి సందర్భంగా ఓ చక్కని నాటిక వెయ్యాలని మావూరి కుర్రాళ్ళ మంతా నిశ్చయించుకున్నాం.

అడపా దడపా కథా కాకరకాయా రాసే అలవాటుంది గనుక గ్రామస్తులకి నచ్చే అంశాలతో ఓ నాటిక రాయమన్నారంతా. పనీ పాటా లేని నిరుద్యోగిని గనుక వెంటనే ఒప్పేసుకున్నాను.

అటక మీది పాత కట్టలు బయటికి తీసి గతంలో రాసిన ఓ నాటికి బూజు దులిపి మార్పులూ చేర్పులూ చేసి మావాళ్ళకి విన్పించాను.

సుమారు గంటా గంటంబావు పట్టే ఆ నాటిక పేరు " ఈ పుణ్యభూమిలో ఓ స్త్రీ".

కథ ఒక పేదింటి అమ్మాయి చుట్టూ తిరుగుతుంది. ఆమె పేదిరకాన్నీ అసహాయతనీ ఆసరా చేసుకుని ఆమె శీలాన్ని కబళించాలనీ తమ ఉంపుడుగత్తెగా చేసుకోవాలనీ కనీసం వేశ్యగామార్చాలనీ కొందరు వ్యక్తులు ధన, బల, భయ, పదవీ ఉపాయాలద్వారా ప్రయత్నిస్తారు. అవమానిస్తారు. హింసిస్తారు. కానామె దేనికీ లొంగక మొక్కవోని ధైర్యంతో నిలబడుతుంది.

చివర్లో ఈదేశపు స్త్రీల గొప్పతనం గురించీ ప్రాణం కన్నా మిన్నగా భావించే శీలసంపద గురించీ మహోద్రేకంతో ఉపన్యసించి ఆ రాబందుల బారినపడకుండా అగ్నికాహుతి కావడానికి ప్రయత్నిస్తుంది. అప్పుడంతా తప్పు తెలుసుకుని ఆమెనా ప్రయత్నం నుంచి విరమింప జేసి క్షమించమని కోరి ఆమెని తమ చెల్లెలిగా స్వీకరించడంతో తెరపడుతుంది.

చాలా బావుందనీ ముఖ్యంగా క్లైమాక్స్‌లోని డైలాగులు చాలా పవర్‌ఫుల్‌గా వున్నాయనీ మెచ్చుకున్నారంతా. మనదేశ సంస్కృతిని గొప్పగా వివరించేవంటూ పొగిడేరు మా గ్రామ పెద్దలు.

అంతా బాగానే వుందికాని మరి హీరోయిన్ సంగతేమిటి?

అందర్లోనూ అదే ప్రశ్న. ముఖాముఖాలు చూసుకుని బుర్రగోక్కున్నాం.

మా వూరులాంటి పల్లెలో ముఖానికి రంగు పూసుకోడానికి ఏ అమ్మాయీ ముందుకు రాదని తెలుసు. పైగా హీరోయిన్ ఓరియంటెడ్ నాటిక. అంచేత రంగస్థలానుభం వున్న అమ్మాయిని బుక్‌చేస్తేనే నాటిక రక్తి కడుతుంది.

నవమి ఉత్సవ నిర్వాహకులు శేషావతారంగారు ఇతర ఖర్చుల్తోబాటు అమ్మాయికివ్వాల్సిన డబ్బు కూడా ఇవ్వడానికొప్పుకోవడంతో మా వుత్సాహం ఇనుమడించింది. లేడీ ఆర్టిస్ట్‌కోసం అన్వేషించగా కడకి భీమవరంలో చక్కని నటి వుందని తెలుసుకునెళ్ళాం నేనూ, శాయీ, పుల్లారావూనూ.

భీమవరం జంక్షన్‌కి దగ్గర్లో వున్న దేవిశ్రీ ఇంటికెళ్ళేం. ఒక తాటాకింట్లోని చిన్న పోర్షన్‌లో వుంటున్నారు వాళ్ళు. ఒక గది వసారా అంతే అంచేత గది మంచాల్తో పెట్టెల్తో, ఇతర సామాన్లతో కిక్కిరిసివుంది. గోడకి పాత నిలువుటద్దం వ్రేలాడుతోంది. దాని ప్రక్కనే దేవిశ్రీ ఫోటో నవ్వుతోంది.

ఆమె సాదరంగా ఆహ్వానించింది. కుర్చీలో నేనూ మంచంమీద మిగతావాళ్ళూ సర్దుక్కూర్చున్నాం. సాదాసీదాగావున్న ఆమెని చూసి మావాళ్ళు కొంచెం ఆశాభంగం పొందినట్లు ముఖాలు పెట్టారుగాని ఆమె నాకు బాగా నచ్చింది. ముఖ్యంగా ఆమె కళ్ళూ భావాలని ప్రస్ఫుటంగా ప్రదర్శించడాని కనువైన చెక్కిళ్ళూ ఆమెని ఉత్తమనటిగా తీర్చిదిద్దగలవన్పించడమే దానిక్కారణం.

ఆమె వడగళ్ళవానలా మాట్లాడేసింది - తనువేసిన వేస్తున్న నాటకాల గురించీ వచ్చిన వినవచ్చిన ప్రశంసల గురించీనూ. ఒక పరిషత్‌లో ఉత్తమనటి బహుమతి ఇచ్చారంటూ బుల్లి కప్పు చూపించింది. తనగురించీ తనున్న నాటక ప్రదర్శన గురించీ కొన్ని స్థానిక చిల్లర పత్రికల్లో వచ్చిన వార్తల్ని కత్తిరించి దాచిన ఫైలుని చూపించింది. వాళ్ళమ్మ ఇచ్చిన బెల్లం కాఫీని అతికష్టంమీద త్రాగి అసలు విషయానికొచ్చాం.

"మాది ఈ పరిసర గ్రామమండీ. మేం ఓ నాటిక వెయ్యబోతున్నాం. మిమ్మల్ని హీరోయిన్‌గా బుక్ చేసుకోవాలనొచ్చాం" మా అందర్లోకీ పెద్దవాడైన శాయి అన్నాడు.

"ఏ పరిషత్‌కెళ్తున్నారు?" ఉత్సాహంగా అడిగింది.

పరిషత్తుల్లో కప్పులొస్తేనే తనకి గుర్తింపూ తద్వారా సినిమా ఛాన్సూ వస్తాయని ఆమె ఆశ కాబోలు!

"అబ్బే. పోటీ కెళ్లటంలేదు. నవమికి మా వూళ్ళోనే వేస్తున్నాం"

"ఓహ్ - పందిరినాటకమా!" నిరాశగా తేలిగ్గా అంది.

అదిరిపడి ముఖాముఖాలు చూసుకున్నాం.

"ఇంతకీ పౌరాణికం లాగించటం లేదు కదా ఖర్మ?"

"లేదండీ. 'ఈ పుణ్యభూమిలో ఓ స్త్రీ' అనీ ఓ సాంఘిక నాటిక"

"బాబోయ్. కొత్తనాటకమా. అంతా బట్టీ పట్టాలంటే చచ్చినంతపనే"

చిర్రెత్తుకొచ్చింది నాకు. తను వేసింది పట్టుమని నాలుగు నాటికల్లేవు. ఏవో పాతిక నాటకాలాడినట్టు మాట్లాడుతోంది!

"అవునండీ కొత్తనాటకమే. నేనే రాశాను. మీరు నటిస్తానంటే స్క్రిప్టు కాపీ ఇచ్చివెళ్తాం. ఇకపోతే మీ రేటు సంగతికూడా తేల్చేస్తే బావుంటుంది."

"గంటలోపైతే నూట యాభై, గంట దాటేట్టయితే రెండొందలు. పందిరి నాటకం గనుక ఒక్కసారే రిహార్సిల్ కొస్తాను. నేనూ మా అమ్మా వస్తాం. చార్జీలిచ్చి ఇరవై ఇవ్వాలి."

"అలా అయితే కుదరదండీ. కనీసం మూడు రిహార్సిళ్ళకి రావాలి. మా నాటకం గంటసేపు వుంటుంది. నూట ఇరవై ఇస్తాం ఇష్టమైతే చెప్పండి లేకపోతే లేదు" లేస్తూ అన్నాను.

"నూట ఇరవైకి కొత్తగా ముఖానికి రంగుపూసుకున్నది కూడా రాదు"

మేం వెళ్ళడాని కుద్యుక్తమవుతోంటే ఆమె తల్లి వచ్చింది "అదేంటి బాబూ వెళ్ళిపోతున్నారూ. కూర్చోండి. మీకు తెలీందేవుంది. అమ్మాయి ఉబలాటం కొద్దీ నాటకాలాడుతోందిగాని నాటకాలు కూడు పెడతాయా గుడ్డపెడతాయా. మీరిచ్చే డబ్బు నాణెమైన చీర కొనుక్కోడానికే చాలదు కదా..." అంటూ కష్టసుఖాలు చెప్పుకొచ్చింది.

కడకి నూటముప్ఫై ఇచ్చేట్టూ రెండు రిహార్సిల్స్‌కి వచ్చేట్టూ నాటక ప్రదర్శన రోజు ఉదయం మూడో రిహార్సిల్ వేసుకునేట్టూ ఆవిడ ఒప్పించింది.

ఎడ్వాన్సూ, స్క్రిప్టు కాపీ యిచ్చాం. మొదటి రిహార్సిల్‌కి ఎప్పుడు ఎలా రావల్సిందీ చెప్పి చార్జీలు కూడా ముందే ఇచ్చేసి చక్కా వచ్చేం.

హీరోయిన్ సమస్య తీరిపోయింది గనుక మర్నాడే రిహార్సిల్స్ మొదలు పెట్టేం. రంగస్థల ప్రముఖనటుడు శ్రీరంగంగారు నాటక దర్శకత్వాన్ని పర్యవేక్షించడానికి అంగీకరించడంతో ద్విగుణీకృతోత్సాహంతో ఆ కార్యక్రమం చేపట్టేం.

ఒక్క పదిరోజుల్లో పాత్రధారులందరికీ పోర్షన్లు కంఠతా వచ్చెయ్యడమే కాదు నటనలో కూడా చాలావరకూ సుశిక్షుతులయ్యారు. ఇక హీరోయిన్‌తో రిహార్సిల్స్ చేస్తే కాలం వృధా అవదనీ నటనని మరింత వృద్ధిచేసుకోవచ్చన్న నమ్మకాని కొచ్చేం.

దేవిశ్రీ మొదటి రిహార్సిల్‌కి రావాల్సిన రోజు.

ఆమె మధ్యాహ్నం మూడు గంటలకి వస్తానన్నా రెండు గంటలకే బస్టాండులో కాపలా కాశాం. నాలుగున్నరకి వచ్చిందామె తల్లితో కలిసి.

దేవిశ్రీ మేం ఇదివరకు చూసినప్పట్లా సాదాసీదాగా లేదు. చాలా అందంగా ఆకర్షణీయంగా వుంది. ఆకాశ నీలపు జార్జెట్ చీర, దానికి మేచయ్యే జాకెట్టు, చక్కని హెయిర్ స్టయిల్, పెద్ద కళ్ళద్దాలు, చెవులకి పెద్దరింగులు, మెడలో పూసలదండ, కనుబొమల మధ్య బొట్టు, పెదాలకి లిప్‌స్టిక్ – మొత్తానికి చిన్న సైజు సినీ తారలూ వుంది. శ్రీదేవి మేనరిజమ్‌ని అనుకరిస్తోంది కూడా.

వాళ్ళని రిక్షాల్లో భుజంగరావుగారింటికి తీసుకెళ్ళేం. వారింటి హాల్లోనే రిహార్సిల్స్ వేస్తున్నాం. టీలయ్యాక ఆ కార్యక్రమం చేపట్టేం.

ఖాళీలేనందున స్క్రిప్టు చదవలేదంది దేవిశ్రీ. చేసేదిలేక సూచాయిగా కథ వివరించి మొదటిసీను టేకప్ చేశాడు మా డైరెక్టర్ వెంకట్రావు.

నటన విషయంలో కూడా మాకు నిరాశే ఎదురయింది. వెంకట్రావు ఎలా చెయ్యాలన్నది చేసిచూపిస్తోన్నా ఆమె ఫాలో అవ్వలేకపోతోంది. బొమ్మలా నిలబడిపోయి డైలాగ్స్ వల్లిస్తోంది. దానికి తోడు లెక్కలేనన్ని ఉచ్ఛారణ దోషాలు!

ఎలా నిలబడాలో ఎలానడవాలో ఎలా భావాన్ని వ్యక్తీకరించాలో డైలాగ్ ఎలా చెప్పాలో ఎంతో ఓర్పుతో నేర్పుగా చెప్పాల్సొచ్చింది.

తోమగా తోమగా ఆమె దార్లోపడుతోందన్న నమ్మకం కలిగేసరికి ఏడున్నర గంటలయ్యింది. చిన్నగా నిట్టూరుస్తూ రిహార్సిల్ ఆపేం.

దేవిశ్రీకీ ఆమె తల్లికీ సర్పంచిగారింట్లో విడిది ఏర్పాటు చేశాం. భోజనం కూడా అక్కడే. వారింటికి రిక్షాల్లో తీసుకెళ్ళి భోజనం వగైరాలయ్యాక తొమ్మిదిన్నరకి తీసుకొచ్చాం.

దుస్తులు మార్చిన దేవిశ్రీ మరింత ఆకర్షణీయంగా వుంది. ఎవరిచ్చారోగాని ఇన్ని పూలు తలలో పెట్టుకుంది. అందర్తోనూ కలుపుగోలుగా వుంది. రిహార్సిల్స్ చక్కని వాతావరణంలో సాగాయి పదకొండున్నర వరకూ. మధ్యలో టీలూ ఉప్మాలూనూ.

రిహార్సిల్స్ పూర్తయ్యేవరకూ తల్లి చూడవచ్చిన వూరి పెద్దల్తో ఇతర కుర్రాళ్ళతో అడ్డూ అపూ లేకుండా కబుర్లు చెపుతూనే వుంది.

మరికాస్సేపు డైలాగ్ రిహార్సిల్స్ చేద్దామని మావాళ్ళు ఉత్సాహపడ్డారు. ఆమె నిద్రొస్తోందనడంతో ఆ ప్రయత్నం విరమించి వాళ్ళని సర్పంచి గారింటికి చేర్చాం.

మర్నాటి ఉదయమే వాళ్ళెళ్ళిపోయారు. ఎంచేతో వారి ముఖాల్లో కళలేదు. మాటల్లో కలివిడితనం లేదు. మూడీగా, ముభావంగా వున్నారు. నిద్రలేమి వల్ల కాబోలని సరిపెట్టుకున్నాం.

సమాజ సభ్యులమందరం వారికి సాదరంగా వీడ్కోలు చెప్పేం. రెండో రిహార్సల్‌కి రావాల్సిన తేదీని చెప్పి చార్జీలగ్గాను డబ్బిచ్చాం.

హీరోయిన్‌కి సంబంధించిన కబుర్లు అధిక పాత్ర ధరించడంతో మర్నాటి రిహార్సల్స్ నత్తనడక నడిచాయి. ఆ కబుర్లలో కొత్త కబురేవిటంటే మళ్ళీ ఇస్తానని చెప్పి దేవీశ్రీ తల్లి రంగడి దగ్గర నలభై రూపాయలు తీసుకుందిట! సమాజం వాళ్ళం ఇంతమందిమి వుండగా షోకిల్లాలా వుండే రంగడి దగ్గర ఆవిడ అప్పు తీసుకోడం మాక్కొంచెం ఆశ్చర్యం కలిగించిందని చెప్పాలి.

దేవిశ్రీ రెండో రిహార్సిల్‌కి రావాల్సిన రోజున యథాప్రకారం బస్టాండుకి చేరాం నాటక పక్షులమంతా.

బస్సులు వస్తున్నాయి. వెళ్తున్నాయి. మూడుగంటలకి రావల్సినామె ఏడుగంటలైనా రాకపోయేసరికి అసలు వస్తుందా రాదా అన్న సంశయం కలిగిందందరికీ.

మావల్లేమైనా తప్పు జరిగిందేమోనని ఒక్కసారి సమీక్షించానుగాని ఎక్కడా ఎలాటి లోపమూ జరగలేదు. మావాళ్ళు చాలా మర్యాదగా, గౌరవంగా ప్రవర్తించారు. అతిథ్యలోపమూ లేదు. మరెందుకు రానట్టు?

ఇంకో గంట చూసినా లాభంలేకపోయింది. వెంటనే వెళ్ళి వాళ్ళని తీసుకురమ్మని పుల్లారావుని భీమవరం పంపించేం.

ఆఖరి బస్సుకి వాడొక్కడూ వచ్చాడు ముఖం వేలాడేసుకుని.

"దేవిశ్రీ రాలేదేంరా?"

"పరిషత్ నాటికవాళ్ళొచ్చి అర్జంటని తీసుకెళ్ళార్ట. ట్రిప్పాటినీ వుందిట. ఎల్లుండొస్తామని చెప్పిందామె తల్లి"

"సరి సరి"

"కాని నాకు నమ్మకం కలగటంలేదు గురూ - కూతుర్నొక్కదానికీ ఒంటరిగా పంపనని బోలుడు కోతలు కోసింది కదా"

"ఇంకేం పనులున్నాయోలే" నేనలా అనేసరికి మరెవరూ తర్కించలేదుగాని నాకూ ఎక్కడో గుండెల మారుమూలల్లో అనుమానంగానె వుంది.

ఆ మూడోరోజున కూడా ఆమె రాకపోయేసరికి మాకు ఒళ్ళు మండిపోయింది. ప్రదర్శనకింక పట్టుమని వారం రోజులు కూడా లేవు. పైగా తనికి పోర్షన్ రాలేదు. అయినా రిహార్సిల్స్‌కి ఎగనామం పెడుతోందంటే ఏమనుకోవాలి?

మర్నాడు నేనూ శాయీ వెళ్ళేం తాడో పేడో తేల్చుకోవాలని.

అదృష్టవశాత్తూ తల్లీకూతుళ్ళిద్దరూ ఇంట్లోనే వున్నారు. బెదురుచూపుల్తో ఆహ్వానించారు. మేం నోరు విప్పకుండానే చెప్పేశారు క్రితంరాత్రి ప్రభుత్వం వారి కుటుంబ నియంత్రణ ప్రచార నాటకం వెయ్యడానికెళ్ళిందిట. ఆఖరి నిమిషంలో పిలవడంవల్ల కబురు పంపలేకపోయార్ట. వారిని కాదంటే మళ్ళీ వారి ప్రదర్శనలకి పిలవరట.

"అది నిజమేననుకోండి. కాని వచ్చేవారమేకదా మా నాటిక ప్రదర్శించాల్సింది"

"ఈలోగా వచ్చేదేగానండి ఖాళీలేదండీ. అయినా ప్రదర్శనరోజు ఉదయం చీకటితో లేచి వచ్చేస్తాం. రెండు రిహార్సిల్స్ వేసుకోవచ్చు. మా అమ్మాయి పోర్షను గురించి మీరేం ఇదవ్వకండి. దానికంతా కంఠతా వచ్చేసింది. కాస్త ఖాళీగావుంటే చాలు ఆ పుస్తకం పట్టు క్కూర్చుంటోంది." అందామె తల్లి.

"ఈలోగా ఒక్కసారైనా వస్తే బాగుణ్ణు."

"ఖాళీలేదండి. లేకపోతే రావడానికి వెనుకాడతామా చెప్పండి? పైగా మీ సమాజం వాళ్ళన్నా మీ వూరన్నా అమ్మాయికెంతో ఇష్టం. ఇంత ఇదైన నాటకాలవాళ్ళ నెక్కడా చూడలేదమ్మా అంటోంది అస్తమానూ."

ఆ ప్రశంసకి పొంగిపోయి తలూపి వచ్చేశాం-ప్రదర్శన రోజు ఉదయమే తప్పకుండా రావాలని మరీ మరీ చెప్పి.

బజార్లో శాయి మిత్రుడు కన్పించాడు. మొదట దేవిశ్రీ గురించి మాకు చెప్పిందతడే. ఆవిడిలా రిహార్సిల్స్ కొస్తానన్చెప్పి దగా చేసిందని చెప్పగా అతడెంతో ఆశ్చర్యపోయాడు.

"అలాగందా దానిముఖం. రాత్రి కాలవవతల సత్యన్నారాయణ టాకీసు మొగలో కన్పించింది నాకు..."

"మీరెవర్ని చూసి ఎవరనుకున్నారో"

నా మాట పూర్తికాకుండానే అన్నాడు. "భలేవారే. అదినాకు తెలీకపోవడం ఏమిటి!" అని అదోరకంగా నవ్వేడు.

మేం మాటలు పెంచకుండా శలవు తీసుకునొచ్చేశాం.

"ఏమిటీ, ప్రదర్శన రోజున రిహోర్సిల్స్‌కి వస్తే సరిపోతుందిటనా? తనేమైనా మహానటి అనుకొంటోందా? ఉత్త మట్టిబొమ్మ! అలంకరించుకోవడం తెలుసుగాని నటించడం బొత్తిగా తెలీదు" అని మండిపడ్డాడు మా డైరెక్టర్ వెంకట్రావు.

"చూస్తోంటే దానికి గీరెక్కువలా వుందిరా. మనమేదో గొప్పగా చూసేసరికి తను నిజంగా గొప్పదాన్నే అనుకుంటోంది కాబోలు" అని ఒకరు నిరసిస్తే, "అసలు ప్రదర్శనకైనా కరక్టుగా వస్తుందా అని" అనుమానం వ్యక్తపరిచారింకొకరు.

ఆమె రాక విషయమై కొంచెం సంశయంగా వున్నా మిగతా ఏర్పాట్లన్నీ ఎలాటి ఆటంకం లేకుండా రాకుండా చేసుకున్నాం. మా కృషి లోపం లేకుండా రిహోర్సిల్స్ చేశాం.

ఊళ్ళోనే గాకుండా పరిసర గ్రామాల్లో కూడా మా నాటకం గురించి బాగా ప్రచారమయ్యింది. మేం నిజంగా 'పొడిచేస్తా'మనే చెప్పుకుంటున్నారంతా. దేవిశ్రీ కూడా సహకరిస్తే వారి అంచనాల మేరకి ప్రదర్శనని రక్తి కట్టించగలమన్న నమ్మకం వుంది.

కానామె పూర్తిగా సహకరిస్తుందా అన్నదే ప్రశ్న.

మా శ్రమకీ మా ప్రతిభకీ పరీక్ష రోజు రానే వచ్చింది.

లేడీ ఆర్టిస్టుకోసం నిరీక్షించకుండా తెల్లవారు ఝామునే మొదటి బస్సుకి శాయిని భీమవరం పంపించాం దగ్గరుండి ఆమెని తీసుకురమ్మని.

మేం కూడా రొటీన్ పనులు వేగంగా ముగించుకుని భుజంగరావుగారింటికి చేరేం.

'ఆవిడొచ్చేలోగా ఓ రిహోర్సిల్ లాగిద్దాం' మా డైరెక్టరన్నాడు.

"ఎలాగూ కాస్సేపట్లో ఆవిడొచ్చేస్తుంది కదా. ఏకంగా ఒకేసారి మొదలు పెడదాం. మరీ ఎక్కువగా నలిగిపోతే సాయంత్రం తేలిపోయే ప్రమాదం కూడా వుంది" అన్నాడు విశ్వనాథం.

దాంతో రిహోర్సిల్ సంగతి ప్రక్కనపెట్టి దుస్తుల గురించీ ఆహార్యం గురించీ స్టేజి అలంకరణ గురించీ మాట్లాడుకొంటుంటే పాలకొల్లునుంచి మ్యూజిక్ పార్టీ వచ్చింది.

అందర్లోనూఉత్సాహ తరంగం వువ్వెత్తున లేచింది. ఆ తర్వాత దభీమని పడింది కూడాను. ఉదయమే వస్తానన్న దేవిశ్రీ నాలుగున్నరకి వచ్చింది మరి!

"ఇప్పుడొస్తే ఎలాగండీ?" కోప్పడ్డాను.

"ఒంట్లో బాగోలేదండీ" అంది నిర్మొహమాటంగా.

"ఏదో ప్రదర్శన కెళ్ళి పదకొండుగంటల కొచ్చారు. రాత్రి నిద్రలేదంటూ పడుకున్నారు. తొందర పెట్టగా పెట్టగా ఇప్పటికి తెమిలి వచ్చారు" అన్నాడు శాయి.

"మిగతా సమాజాల వాళ్ళలా వేగుతున్నారో ఈమెతో" అని విసుక్కున్నా అసలొచ్చినందుకే సంతోషం అనుకోకతప్పింది కాదు.

రిహార్సల్ చాలా డల్‌గా సాగింది సంగీతం వున్నాసరే. మొదటి రిహార్సల్ కొచ్చినప్పట్లానే వుంది దేవిశ్రీ పాత్రపోషణ!

మా నాటకానికి ప్రాంప్టింగే ప్రాణం అని తీర్మానించి అది నాకప్పజెప్పేరు. చేసేది లేక తెరవెనుక చేరేను నటరాజుమీద భారంవేసి.

తెరలేచింది "వందే వందే కళామతల్లి" అంటూ ప్రార్థన చేశాక.

నాటిక మొదట సాఫీగానే సాగింది. హీరోయిన్ ప్రవేశంతో ఒక్కసారే కాళ్ళు నరకబడినట్టయిపోయింది. నేను అందిస్తోన్న ముక్కలు కూడా అందుకోలేక ఏదేదో అంటూ ఏదేదో చేసేస్తోంది దేవిశ్రీ. సహనటులు కూడా గాభరా పడక తప్పిందికాదు. అక్కడకీ ఆమె సంభాషణతో నిమిత్తంలేకుండా మావాళ్ళు సర్దుకుపోదామని చూశారుగాని సక్సెస్ కాలేకపోయారు. స్త్రీ పాత్ర ముఖ్యపాత్రగా నాటకం రాసినందుకు నన్ను నేను తిట్టుకోనితిట్టు లేదంటే అతిశయోక్తి కాదు.

ఆఖరికి మేమో నిశ్చయానికొచ్చి నేను ప్రాంప్టింగ్ గట్టిగా చెబుతోంటే అవి ఆమె చెబుతున్నట్టే భావించుకుని మిగతా వారు తమ తమ డైలాగుల్ని అప్పజెప్పేశారు.

సంగతి జనానికి తెలిసిపోయింది. అయినా చెప్పులు విసరకుండా చూశారూ అంటే వూరి కుర్రాళ్ళమన్న అభిమానంతోనే అన్చెప్పాలి.

బ్రతుకుజీవుడా అంటూ తెరవేసి కూలబడ్డాం.

ఇంకెప్పుడూ స్త్రీ పాత్రల్తో నాటకాలు రాయకూడదని నేనూ స్త్రీ పాత్రగల నాటకాలు ఛస్తే చేపట్టకూడదని మావాళ్ళూ ఒట్లు పెట్టుకున్నాం. లెంపలేసుకున్నాం. దేవిశ్రీ మీద కారాలూ మిరియాలు నూరాం. ఆమె వినబడకుండా తిట్టినతిట్టు తిట్టకుండా శపించి పారేశాం. ఆ తిట్లకీ శాపాలకీ శక్తివుంటే ఆమె ఏమైపోయేదో వూహించడం అసాధ్యం!

ఆవిడ మాత్రం ఏమీపట్టనట్లు నిర్లిప్తంగా ఉండిపోయింది. తనకి రావాల్సిన డబ్బు తీసుకుని టింగురంగా అంటూ వెళ్లిపోయింది. అన్నట్టు రంగడికి డబ్బు తిరిగి ఇవ్వనేలేదు!

ఇది జరిగిన ఆర్నెల్లకి రాజమండ్రి కోటగుమ్మం దగ్గర మరో కుర్రాడితో నవ్వుతూ తుళ్ళుతూ కన్పించింది దేవిశ్రీ.

"ఏం మాస్టారూ" అంటూ తనే పలకరించింది కూడా.

"మీరిక్కడ..."

"కళా పరిషత్ పోటీలకొచ్చాం. మీరు మళ్ళీ నాటకాలెయ్యలేదా?"

"మీ దెబ్బకి బుద్ధొచ్చి లెంపలేసుకున్నాం లెండి" నవ్వుతూ అని, ఎన్నాళ్ళనుంచో నా మనస్సులోని అనుమానాన్ని నివృత్తి చేసుకోడానికన్నాను "మీరు రిహార్సిల్స్‌కి సరిగ్గా రాక మాఉత్సాహాన్ని నీరుగార్చేశారు. మీరెంచేత అలా చేశారో ఇప్పుడైనా చెబుతారా"

ఆమె పేలవంగా నవ్వింది. అందులో కొంత బాధ, దిగులు కూడా లేకపోలేదు.

"మహావుంటే నెలకో నాటకమో నాటికో వుంటుంది. ఆ వందా రెండొందల్తోనే బ్రతికెయ్యగలమా చెప్పండి. కూటికోసం నాటకాలాడుతున్నానుగాని ఏదో కళాసేవ చేసెయ్యాలని కాదండి. అంచేత పై సంపాదనకి ఈ నాటకాలో అసరా. రిహార్సిల్సు కొచ్చినప్పుడు ఈయనలాటివారెవరో తగుల్తారనీ పదిరూపాయలొస్తాయనీ ఆశించే మాకు మీ వూళ్ళో నిరాశే కలిగింది. మీ మంచితనం మమ్మల్ని కదిలించినా రాయిలాగా వుండిపోక తప్పలేదు..."

నటన సరిగ్గా రాని డైలాగ్‌ని సరిగ్గా ఉచ్ఛరించలేని ఆమె ఇప్పుడు...!

అవునిది నాటకం కాదు. జీవనసమరం!

నాలోని ఆదర్శాలూ ఆవేశాలూ ప్రక్కకి పెట్టి ఆమెని మనస్ఫూర్తిగా క్షమించాను. ఆమె స్థితి నాకంతగా అర్థకావడానిక్కారణం నేను రచయితనవడమే కాదు రోడ్డునపడ్డ నిరుద్యోగినవడం కూడా ఓ ముఖ్య కారణమే.

(స్వాతి మాసపత్రిక)
అక్టోబరు 1985